క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 29న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బాలసముద్రం, ఎల్ఐసీ కార్యాలయం, అంబేడ్కర్ కూడలి, నక్కలగుట్ట మెయిన్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాలగోకులానికి దరఖాస్తులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాకాజీకాలనీలోని మాధవ స్మారక సమితి వివేకానంద యోగా కేంద్రంలో 8 రోజుల పాటు నిర్వహించనున్న బాలగోకులం వేసవి ఉచిత శిక్షణ శిబిరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు డాక్టర్ కోదాటి సుధాకర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 1నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ఆధ్యాత్మిక, మానసిక, శారీరక, బౌద్ధిక వ్యక్తిత్వ వికాసంపై అనుభవజ్ఞులైన విద్యా నిపుణులు, శిక్షకులతో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 94407 20624 , 98496 85002 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

చైల్డ్‌లైన్‌కు బాలిక అప్పగింత



కాజీపేట రూరల్: ఇంటి నుంచి తప్పిపోయి కాజీపేట రైల్వే స్టేషన్‌కు వచ్చిన సుమారు 7 ఏళ్ల బాలికను కాజీపేట జీఆర్పీ పోలీసులు చేరదీసి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు అప్పగించారు. కాజీపేట జీఆర్పీ సీఐ ఎం.రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఒంగోలుకు చెందిన కావ్య ఇంటి నుంచి బయలుదేరి కాజీపేటకు వచ్చి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా కనిపించడంతో ఒక ప్రయాణికుడు గమనించి జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించాడు. వారు బాలిక వివరాలు సేకరించి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు అప్పగించినట్లు సీఐ వివరించారు.

కేయూ ఫైనాన్స్ అధికారికి సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫైనాన్స్ అధికారిగా పనిచేస్తూ ఈనెలాఖరులో ఉద్యోగ విరమణ పొందబోతున్న తోట రాజయ్యను పరీక్షల విభాగంలో సోమవారం సన్మానించారు. పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ బీఎస్‌ఎల్ సౌజన్య, డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ ఆసిం ఇక్బాల్ కలిసి రాజయ్యకు బొకే, జ్ఞాపిక అందజేసి సన్మానించారు. అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డాక్టర్ నర్సింహారావు, శ్రీలతాదేవి, సరళాదేవి, పర్యవేక్షకులు సురేష్, సునీల్‌కుమార్, ప్రతాప్ పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి

హన్మకొండ: కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని హౌసింగ్ బోర్డు కాలనీ అధ్యక్షుడు కొండా నాగరాజు అన్నారు. కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి గుంగుల వినోద, కోశాధికారి రవిని అంగన్‌వాడీ టీచర్ పి.సరస్వతి, తదితరులు సోమవారం సన్మానించారు. హెల్త్ సూపర్‌వైజర్ గోవర్ధన్. ఏఎన్ఎం సరోజ, హెల్పర్ స్వప్న, ఆశ వర్కర్లు విజయ, ఉమ, సంధ్య పాల్గొన్నారు.

కళాశాలపై చర్య తీసుకోవాలి

విద్యారణ్యపురి: హనుమకొండలోని భీమారం ప్రాంతంలో అనుమతి లేకుండా నడుస్తున్న ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల జేఈఈ, ఐఐటీ మెయిన్స్ పేర్లతో నడుస్తోందని, ఆ కళాశాల యాజమాన్యంపై చర్య తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ మాజీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని డీఐఈఓ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం డీఐఈఓ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు ప్రశాంత్, శ్రీకాంత్, ప్రభాకర్, రాజశేఖర్, నితిన్, ప్రమోద్, చక్రి పాల్గొన్నారు.

లెర్నింగ్ సెంటర్ పేరుతో ప్రచారం

విద్యారణ్యపురి: హనుమకొండ నగరంలో లెర్నింగ్ సెంటర్ పేరుతో ప్రచారం నిర్వహిస్తూ అనుమతి లేకుండా ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఏఐఎఫ్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున్ అన్నారు. ఆ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని డీఐఈఓ గోపాల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, బాధ్యులు పాలబోయిన రాజు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా క్రీడామైదానాలు

- జాడలేని క్రికెట్ కిట్లు
- దృష్టిసారించని అధికారులు
- క్రీడాకారుల అసహనం



కామారంలో నిరుపయోగంగా మారిన క్రీడా మైదానం

ఆత్మకూరు : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు గత ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు అలంకారప్రాయంగా మారాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో అట్టహాసంగా ప్రారంభించిన ప్రభుత్వం.. సౌకర్యాలు కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. జీపీ సిబ్బంది వీటిని అందుబాటులోకి తీసుకురావడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. జీపీ అధికారులను క్రికెట్ కిట్లు అడిగినా ఇవ్వడం లేదని యువకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. క్రీడా మైనాదాలను శుభ్రం చేసి ఆట వస్తువులను అందుబాటులో ఉంచాలని క్రీడాకారులు కోరుతున్నారు. పలు గ్రామాల్లో క్రీడా మైదానాలు చెత్తాచెదారంతో నిండిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేసవి కాలంలో క్రీడలు ఆడే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలను వినియోగంలోకి తీసుకురావాలి. దీంతో గ్రామాల్లోని యువకులు, విద్యార్థుల్లో దాగివున్న క్రీడా స్ఫూర్తి మెరుగుపడుతుంది. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

- ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, పెంచికలపేట

క్రీడా సామగ్రిని అందుబాటులో ఉంచాలి



క్రీడా మైదానాల్లో ఆడుకునేందుకు క్రీడా సామగ్రిని అందుబాటులో ఉంచాలి. అధికారులు స్పందించి క్రీడా మైదానాలను శుభ్రం చేయించాలి.

-బయ్య పైడి, ఆత్మకూరు

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



యాత్ర చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నడికూడ : రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద గల డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జమ్ము కాశ్మీర్ పహల్గామ్‌లో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బీజేపీ మత రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు. బీజేపీ పాల్పడే భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంత, లింగ, ధనిక, పేద భేదాలు లేకుండా అందరికి సమాన హక్కులను కల్పించే రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి.. సాయిశివాని



వరంగల్: ఆల్ ఇండియా 11 ర్యాంక్ సాధించిన సాయిశివాని.. తెలంగాణకే కీర్తి కిరీటమని, ఆమె జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ అన్నారు. సప్తధామంలో శివానికి ట్రస్ట్ తరఫున యంగ్ టాలెంట్ అవార్డును సోమవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సాయిశివాని మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, శ్రద్ధతో ఏదైనా సాధ్యమని అన్నారు. తన విజయానికి భగవద్గీత కూడా దోహదపడిందని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బండారు సాయి నారాయణ, సోమ రామయ్య, ఉమాశంకర్, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, ఈవీ.శ్రీనివాసరావు, అనిత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణే లక్ష్యం

వరంగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల్లో బాల్య వివాహాల నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు షేర్ స్వచ్ఛంద సంస్థ వరంగల్, హనుమకొండ జిల్లాల కోఆర్డినేటర్ తోట శిరీష తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ కోసం మత పెద్దలతో కలిసి అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గుర్తుచేశారు. 2030వ సంవత్సరం నాటికి దేశం నుంచి బాల్య వివాహాలను నివారించాలనే లక్ష్యంతో జేఆర్సీ 'బాల్య వివాహ రహిత భారత ప్రచారా'న్ని నిర్వహిస్తుండటం గమనార్హం అన్నారు.

పొంగులేటిని కలిసిన మేయర్

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం(ఆర్ఓఆర్) 2025పై హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార శాఖ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డిని హెలిపాడ్ వద్ద నగర మేయర్ గుండు సుధారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.

ప్రయాణంలో అప్రమత్తత అవసరం



ఖిలా వరంగల్: రైలులో ప్రయాణించేటప్పుడు ప్రయాణికులు విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ సూచించారు. దేశవ్యాప్తంగా చేపట్టిన భద్రతా చర్యల్లో భాగంగా సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత బెనర్జీ ఆదేశాల మేరకు వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ పోలీసులు సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాట్‌ఫారాలు, రైల్వే స్టేషన్ ఆవరణలో ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం సీఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రైలు ప్రయాణంలో అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపించినా, వస్తువులు కనిపించినా వెంటనే ఆర్పీఎఫ్ కంట్రోల్ నంబర్ 139కు సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికులు తమ బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఎస్సై వెంకటేశ్వర్లు, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

'భూ భారతి'పై నేడు అవగాహన సదస్సు

పరకాల : తెలంగాణ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు జరిగే సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, రెవెన్యూ అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఎంజేపీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.కవితారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని, ఆసక్తి కలిగిన విద్యార్థులు మే 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 040 23328266 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వృద్ధురాలి ఆత్మహత్య



సమ్మక్క (ఫైల్)

దామెర : అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొడు సమ్మక్క (70) కొంతకాలంగా అస్తమా, మానసిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. కాగా ఆదివారం రాత్రి ఇంటి ఎదుట నిద్రిస్తున్న సమ్మక్క ఉదయం కనిపించలేదు. దీంతో బంధువులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. కాగా గ్రామానికి సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బావి నుంచి సమ్మక్క మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మృతిరాలి కుమారుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నివాళి



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మారేపల్లి నాగరాజు ఆదివారం ప్రమాదవశాత్తు గోడ కూలి మీద పడగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి సోమవారం నాగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. రాజేందర్, మోహన్, పాపయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రజతోత్సవ సభ సక్సెస్



ఐనవోలు : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సక్సెస్ అయిందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తంపుల మోహన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తక్కళ్లపల్లి చందర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడుతూ.. సభకు ప్రజలు వెళ్లకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలివచ్చారన్నారు. సభ సక్సెస్‌కు కృషిచేసిన మండల నాయకులకు, కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉస్మాన్ అలీ, గడ్డం రఘువంశీ, కాటబోయిన అశోక్, చందు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

వరంగల్: ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా వరంగల్ ఏనుమాముల మార్కెట్‌ను బంద్ చేయాలని మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డిని ఆల్ ట్రేడ్ యూనియన్ల నాయకులు కోరారు. ఈమేరకు మార్కెట్ కార్యాలయంలో సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్, గన్నారపు రమేష్, ముక్కెర రామస్వామి, జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, సుంచు జగదీశ్వర్ మాట్లాడుతూ ఎంతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి, వాటి అమలు కోసం ప్రయత్నం చేస్తోందన్నారు.

ఖిలా వరంగల్: వచ్చేనెలలో జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో కందిక చెన్నకేశవులు అధ్యక్షతన ఏఐటీయూసీ జిల్లా సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పనాస ప్రసాద్, ఎలేందర్, జాన్‌పాల్, గోవర్ధన్, యాకూబ్, రవి, రాజు, శంకర్, యోగానంద్, కుమార్ పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను ఆపేయాలి

ఖిలా వరంగల్: ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని, తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రిగుట్ట ప్రాంతంలో కేంద్ర పోలీస్ బలగాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు పడమర కోట అమరవీరుల స్తూపం వద్ద నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్ హంట్ మొదలు నేటి ఆపరేషన్ కగార్ వరకు అనేక మంది అమాయక ఆదివాసీ ప్రజలు కేంద్ర బలగాల చేతిలో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖనిజ సహజ సంపదను బడా కార్పొరేట్ శక్తులు, బహుళ జాతి కంపెనీలకు అప్పగించేందుకే ఈ నరమేధాన్ని కేంద్రం కొనసాగిస్తోందని ఆరోపించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్



ఎల్కతుర్తి : సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్కతుర్తి : రాష్ట్రంలోని రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ శివారులో 33/11కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి కలెక్టర్ ప్రావీణ్య, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితో కలిసి ఆయన భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రూ.2.14కోట్ల వ్యయంతో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అదే విధంగా గతంలో ధాన్యం కొనుగోళ్లలో తాలు, తరుగు పేరుతో కటింగ్ ఉండేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. బీఆర్ఎస్ నాయకులు కేవలం రాజకీయంగా విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గట్లనర్సింగాపూర్‌లో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు చేయడం వలన చుట్టుపక్కల ప్రాంతాల రైతులకు మెరుగైన విద్యుత్ అందుతుందని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. అనంతరం సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఆర్డీఓ రమేశ్ రాథోడ్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ వీరేశం, స్థానిక రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

భూ భారతితో భరోసా..

రైతులకు భూమిపై ఉండే హక్కులను కాపాడేందుకే భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో భూ భారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రి పాల్గొని పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను తిలకించారు.

స్టేట్ ర్యాంకర్‌కు మంత్రి సన్మానం

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల కళాశాలలో చదువుకుంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన డి.వినయ్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సోమవారం అభినందించి సన్మానించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాల్లో కమలాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల కళాశాల విద్యార్థి డి.వినయ్ ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 468/470 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి అభినందించి శాలువాతో సన్మానించి రూ.10 వేల నగదు ప్రోత్సాహకం అందించారు. మంత్రితో పాటు ఎంజేపీ గురుకులాల కార్యదర్శి సైదులు, ఆర్‌సీఓ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ పి.కవితారెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

- ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూరు : మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో సోమవారం ఎఫ్ఎంఎం, 'మా'సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మహిళా సాధికారత సాధించడంతో పాటు పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలని సూచించారు. తద్వారా పిల్లలపై హింసలేకుండా చూడవచ్చని అన్నారు. బాలలపై హింస జరిగినప్పుడు చైల్డ్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎంఎం డైరెక్టర్ సహాయ, కోఆర్డినేటర్లు కరుణ, శ్రీకాంత్, మా సంస్థ కార్యదర్శి శివప్రసాద్, ఎంపీఓ విమల, పంచాయతీ కార్యదర్శి శ్వేత, విజయ, స్రవంతి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భరోసాగా ఆయిల్‌పామ్ సాగు



మాట్లాడుతున్న సైంటిస్ట్ రాజశేఖరరెడ్డి

కమలాపూర్ : ఆయిల్‌పామ్ తోటల సాగు రైతులకు భవిష్యత్ భరోసాగా నిలుస్తుందని ఉద్యాన శాఖ పరకాల డివిజన్ అధికారి మధులిక అన్నారు. మండలంలోని గూడూరు రైతు వేదికలో ఉద్యాన శాఖ, కేఎన్ బయో సైన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ తోటల సాగుపై రైతులకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, భవిష్యత్‌లో వంద శాతం భరోసా కల్పిస్తుందన్నారు. అనంతరం కేఎన్ బయో సైన్సెస్ జిల్లా మేనేజర్ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులు ముందుకు రావాలని, ఆయిల్‌పామ్ ధర టన్నుకు రూ.21 వేలు ఉందన్నారు. ప్రస్తుతం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి, ఎల్కతుర్తి మండలం బావుపేటలో ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, త్వరలోనే ములుగులో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని నిర్మించనున్నట్లు చెప్పారు. అనంతరం సైంటిస్ట్ రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు చట్టబద్ధతతో కూడుకున్నదని, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు, డ్రిప్ ద్వారా ఎరువులు పంపే విధానాన్ని రైతులకు వివరించారు. కేఎన్ బయో సైన్సెస్ జీఎం హేమంత్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మహిపాల్, ఏఈఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న సుమన్

శాయంపేట : మండలంలోని అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఎస్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ ఫణిచంద్రకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో అర్హులకు అన్యాయం చేసే కుట్ర జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతి గ్రామాన్ని సందర్శించి ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి మొదటి విడతలో వారికి ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగితే ప్రజలతో కలిసి ప్రభుత్వంపై ఉద్యమిస్తామని ఈ సందర్భంగా ఆయన వినతిలో హెచ్చరించారు.

వీఓఏలను ప్రభుత్వం గుర్తించాలి

- రాష్ట్ర అధ్యక్షురాలు మాధవి



మాట్లాడుతున్న మాధవి

శాయంపేట : మహిళల అభివృద్ధి కోసం గ్రామాల్లో పని చేస్తున్న వీఓఏలను ప్రభుత్వం గుర్తించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు మాధవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం మండల యూనియన్ సమావేశం మండల అధ్యక్షురాలు బడుగు విజయ అధ్యక్షతన జరుగగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు వీఓఏలకు రూ.26వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. వీఓలకు హెల్త్‌కార్డులు, ఐడీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇటీవల జరిగిన జిల్లా యూనియన్ ఎన్నికల్లో శాయంపేట మండల అధ్యక్షురాలు బడుగు విజయ జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నికైన సందర్భంగా ఆమెను సన్మానించారు. యూనియన్ మండల కార్యదర్శి సుహాసిని, కోశాధికారి శోభ, ఉపాధ్యక్షురాలు షబానా, సహాయ కార్యదర్శి రజిత పాల్గొన్నారు.